

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

## ప్రజాసేవకై ముందుకు సాగుతా

**మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

వికారాబాద్, డిసెంబర్ 16 : రాజకీయాల్లో ఉంటూ... ప్రజాసేవకై ముందుకు సాగుతానని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్, మోత్కుపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమేనన్నారు. ప్రజల పక్షాన ఉండి వారి సంక్షేమం కోసం పాటుపడుతామని తెలిపారు. అందరు కలిసికట్టుగా ఉండి బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంది పంట లాభదాయకం

**ఎత్తుమడుల సాగు పద్ధతిలో రైతులకు ఎంతో మేలు**

**తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున**

పెద్దేముల్, డిసెంబర్ 16 : కంది పంటలో ఎత్తు మడుల సాగు పద్ధతి రైతులకు ఎంతో లాభదాయకమని తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున, కోఆర్డినేటర్ లక్ష్మణ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన సేంద్రియ రైతు ద్యావరి నారాయణ వ్యవసాయ క్షేత్రంలో క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు పంటలకు సంబంధించిన సాగు పద్ధతులు, మెళకువలపై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త యమున మాట్లాడుతూ వరిలో నారుమడి యాజమాన్యం గురించి వరిలో ఆశించే వివిధ రకాలైన చీడపీడలు వాటి యాజమాన్యం గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా నారుమడి ఏపుగా పెంచుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నారుమడిలో నారు తొలగించే వారం రోజుల ముందు రెండు గుంటల నారుమడికి 8 గ్రాముల కార్బో ఫ్యూరాన్-3 గుళికలు వేసి కాండం తొలుచు పురుగులను నివారించుకోవాలన్నారు. అదే విధంగా నారు నాటిన 15 రోజుల్లో ఒక ఎకరానికి 10 కిలోల కార్బో ఫ్యూరాన్ గుళికలు వేసి దోమపోటు నుంచి రక్షించుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్ మాట్లాడుతూ తక్కువ నీటితో వరికి ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వుల వంటి పంటలను పండించవచ్చని అన్నారు. మొక్కజొన్నను జీరో టిల్లేజ్ పద్ధతి ద్వారా ఒక ఎకరం వరి పండించే నీటితో రెండు మూడు ఎకరాల మొక్కజొన్న పంటను సాగు చేయవచ్చన్నారు. ఆరుతడి పంట అయిన నువ్వులను జనవరి రెండో పక్షం నుంచి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు జీరో టిల్లేజ్ పద్ధతిలో ఆరుతడి పంటలను సాగు చేసుకొంటే అధిక లాభాలను పొందవచ్చని సూచించారు. సేంద్రియ రైతు నారాయణ మాట్లాడుతూ యాంత్రీకరణ ద్వారా విత్తనం సాగు, కలుపు యంత్రాలను తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేలా ఉపయోగించుకోవచ్చన్నారు. అదే విధంగా అన్ని రకాల పనులను సవ్యంగా చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రుద్రారం, నర్సాపూర్, నాగులపల్లి, ఆత్కూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్

## ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి

**కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏడీఏ**

పరిగి, డిసెంబర్ 16 : పరిగి మండల పరిధిలోని రంగంపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిగి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మీకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు వద్ద నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మంచి ధర పొందాలని ఆమె రైతులకు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏడీఏ లక్ష్మీకుమారి

**వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి**

దౌల్తాబాద్ : వానకాలం సీజన్‌లో రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలును అధికారులు వేగవంతం చేసి, ప్రతి క్వింటాలుకు రూ.500 భోనస్‌ను వెంటనే ఇవ్వాలని ఎంపీపీ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితం నుంచి అన్ని గ్రామాల్లో వరికోతలు పూర్తైనప్పటికీ నేటికి అధికారులు పూర్తి స్థాయిలో కొనుగోలు చేయలేదన్నారు దౌల్తాబాద్ మండలంలోని 33 గ్రామాల్లోని రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రూ.500 బోనస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## జాగ్రత్తలు పాటించి దిగుబడికి కృషి చేయాలి

దోమ, డిసెంబర్ 16 : రైతులు తాము పండించిన పంటను దిగుబడి అంచనా వేసుకొని దానికి అనుగుణంగా తదుపరి పంటలో అధిక దిగుబడికి కృషి చేయాలని పరిగి డివిజన్ గణాంక అధికారి జలందర్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి తండా గ్రామ పంచాయతీకి చెందిన మహిళా రైతు పుతాన్ బాయి తన పొలంలో వానకాలంలో రెండు ఎకరాల్లో కంది పంటను సాగు చేయగా, అట్టి పంటను గణాంక అధికారులు శనివారం సందర్శించి పంట దిగుబడిని అంచనా వేశారు. పొలంలో పది మీటర్ల పొడవు, పది మీటర్ల వెడల్పులో కంది పంటను హార్వెస్టు చేసి పంట దిగుబడిని అంచనా వేయగా 6 కిలోల 550 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. దీని ఆధారంగా ఎకరాకు 2 క్వింటాళ్ల 50 కిలోల దిగుబడి రానున్నట్లు చెప్పారు. తదుపరి పంట సాగుకు తగిన జాగ్రత్తలు తీసుకొని అధిక దిగుబడికి కృషి చేయాలని రైతులకు వారు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో సందీప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## నేటి నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం

కొడంగల్, డిసెంబర్ 16: మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ ఆదివారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు, ధర్మకర్తలు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఏటా ధనుర్మాస పూజలను కూడా తిరుమల మాదిరిగా నిర్వహించడం ఇక్కడి విశేషం. ప్రతి రోజు వేకువజామున సుప్రభాత సేవతో మొదలుకొని విశేష కైంకర్యాలు, ప్రత్యేక అలంకరణలతో పాటు ధరూరి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో తిరుప్పావై పారాయణం కొనసాగుతున్నది. ఈనెల 16వ తేదీ రాత్రి 12గంటల తరువాత ధనుర్ సంక్రమణ ఏర్పడుతుండటంతో 17వ తేదీ ఆదివారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమై వచ్చే నెల జనవరి 14వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. జనవరి 14వ తేదీ భోగిపండుగన రోజున గోదాదేవి కల్యాణోత్సవం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవ ఊరేగింపు జరుగుతుందన్నారు. 15వ తేదీ సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలం సాయంత్రం 4 గంటలకు శ్రీవారి తిరుచ్చి ఉత్సవం, 16న కనుమ పండుగ రోజు పద్మావతి అమ్మవారి అలంకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

## 29న మల్లికార్జున స్వామి జాతర

తాండూరురూరల్, డిసెంబర్ 16 : ఈ నెల 29వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు మల్లన్న జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు మండలం, గౌతాపూర్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున దేవాలయం జాతర నాలుగు రోజులపాటు జరుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీన స్వామి వారికి పసుపు బండారంతో అభిషేక కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 30వ తేదీన ఆలయంలో పూజా కార్యక్రమాలతోపాటు భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అదేవిధంగా 31వ తేదీన స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు బోనాల ఉత్సవాలు నిర్వహిస్తారు. జనవరి 1వ తేదీన గ్రామంలో పల్లకిలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మొక్కలను సంరక్షించాలి

మర్పల్లి, డిసెంబర్ 16 : హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సర్పంచ్ సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వీర్లపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలన్నారు. ఎండిన మొక్కలు ఉంటే తొలగించి, వాటి స్థానంలో కొత్త మొక్కను నాటాలని సూచించారు. వచ్చే ఏడాదికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీఏలు భాస్కర్, యాదయ్య, ఎఫ్ఏ వెంకటేశం గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

దోమ, డిసెంబర్ 16: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఏఎస్సై చారి అన్నారు. దోమ మండల కేంద్రంలోని హనుమాన్ కూడలిలో శనివారం ఎస్సై చారి పోలీసు సిబ్బందితో కలిసి వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## భూ కబ్జా చేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

పూడూరు, డిసెంబర్ 16 : వీరహనుమాన్, గాలి పోచమ్మల గుడులను తొలగించి భూ కబ్జా చేసేవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు. పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 151లోని విస్తీర్ణం 20 గుంటల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చన్గోముల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై గిరికి సర్పంచ్ వనజ, ఎంపీటీసీ సురేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీరప్ప, ఇతర దేవాలయాల జాతర సమయంలో ఈ భూమిలోనే ఉత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. ఈ భూమిని హైదరాబాద్‌కు చెందిన భర్కు హలంఖాన్ కొనుగోలు చేసినట్లు చెబుతూ అతడి అనుచరుడైన హైదర్‌ఖాన్ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం ఈ భూమిలో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని తొలగించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయానికి చెందిన భూమి కబ్జాకు గురికాకుండా, విగ్రహాలను తొలగించిన వ్యక్తిపై చట్ట రీత్యా చర్యతీసుకోవాలని వారు కోరారు. ఈ వివాద స్థలాన్ని ఎస్సై సందర్శించి పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఇరువురికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఆ భూమికి సంబంధించిన రికార్డులను చూయించాలని ఇరువురికి నోటిసులు ఎస్సై ఇచ్చారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే వారి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**తిర్మలాపూర్‌లో భూ కబ్జాపై మరో ఫిర్యాదు..**

పూడూరు మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కాళభైరవ ఆలయానికి వెళ్లే నక్షదారితో పాటు రైతులకు తమ పొలాలకు వెళ్లకుండా హైదరాబాద్‌కు చెందిన కామ్రాన్ మీర్జా కబ్జా చేశారని చన్గోముల్ పోలీస్ స్టేషన్ ఎస్సై గిరికి శనివారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 100 సంవత్సరాల చరిత్ర ఉన్న కాళభైరవ ఆలయానికి ఉన్న నక్ష బాట (సర్వేనంబర్ 68లోని చరాయి భూమి) కబ్జా చేసిన వ్యక్తిపై చర్య తీసుకొని గతంలో మాదిరిగా దారి ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

## గిరిజన మహిళలకు ఉచిత శిక్షణ

కులకచర్ల, డిసెంబర్ 16 : కులకచర్ల మండల పరిధిలోని పోటిగడ్డతండాలో సయోధ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు ద్వారా నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు రామచంద్రయ్య తెలిపారు. ఈ నెల 11 నుంచి 27వరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9640587292 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



శిక్షణలో పాల్గొన్న మహిళలు